క్లుప్తంగా

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

లేపాక్షి: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణం పరిరక్షలో భాగంగా మొక్కలు నాటినట్లు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దార్థ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావంతో మెలగాలి



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పెనుకొండ: విద్యార్థులు సేవా భావంతో మెలగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ సూచించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సేవానిరతి ఉండాలన్నారు. సమాజానికి ఆదర్శంగా ఉంటూ ప్రజల్లో చైతన్యస్ఫూర్తిని రగిలించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

లేపాక్షి: మామిడిమాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో చేయూత చారిటబుల్ ట్రస్ట్(హిందూపురం) ఆధ్వర్యంలో ఎంఈఓలు నాగరాజు, కుల్లాయప్ప30 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టూడెంట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయిల్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

అమరాపురం: హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్ల హాజరు పట్టికను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్యాస్ సరఫరా లేకపోవడంతో వంట చెరుకుతో బయట వంట చేస్తున్నామని భోజన ఏజెన్సీ మహిళలు తెలిపారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎంపీడీఓ.. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలియజేశారు. గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని అధికారులను కోరారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తెలిపారు.

సచివాలయాల పరిశీలన

అమరాపురం-1, 2 హలుకూరు-1, 2 గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్లను పరిశీలించారు. సమయపాలన పాటించాలని అధికారులకు సూచించారు. పనిమీద బయటికి వెళ్లేటప్పుడు తప్పకుండా మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి: మండలంలోని కేజీబీవీ, బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యాభివృద్ధికి పాటుపడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

మడకశిర: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శుక్రవారం పట్టణంలో పర్యటించారు. పట్టణంలో జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. డివైడర్లపై గడ్డి మొక్కలను తొలగించే పనులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. అదే విధంగా అన్న క్యాంటీన్ మరమ్మతును పర్యవేక్షించారు. జాప్యం చేయకుండా పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు.

డయేరియాపై అవగాహన



పుట్టగుండ్లపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



అగళి మండలం రావుడి గ్రామంలో తొట్టిలోని నీటిని పారబోయిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండలంలోని పుట్టగుండ్లపల్లిలో శుక్రవారం డాక్టర్ వాసు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది డయేరియా వ్యాధి నివారణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, డెంగీ తదితర జ్వరాలు రాకుండా రాత్రిపూట దోమ తెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత అవసరం

అగళి: మండల పరిధిలోని రావుడి పంచాయతీలో డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ గాయత్రి తెలియజేశారు. ఇళ్ల పరిసరాల్లోని పాత టైర్లు, టెంకాయలు, రిఫ్రిజిరేటర్స్, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తరచుగా డ్రైడే పాటించాలని సూచించారు. డెంగీపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్.ఏ సుందరయ్య ఏఎన్ఎం భిక్షవతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్ పాల్గొన్నారు.

హోమియో మందులతో వ్యాధుల నివారణ

హిందూపురం: ముందస్తుగా హోమియో మందులు తీసుకోవడం ద్వారా డెంగీ, మలేరియా లాంటి వ్యాధులను నివారించవచ్చని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు హోమియో మందుల పంపిణీ చేశారు ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తమను సంప్రదిస్తే ఉచితంగా హోమియో మందులను అందజేస్తామని తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎం శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

హిందూపురం అర్బన్: వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ స్టేషన్ ఆవరణలో హెల్మెట్ల వాడకం, రోడ్డు ప్రమాదాల నివారణపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు రికార్డులు దగ్గర ఉంచుకోవడమే కాకుండా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. అలాగే కార్ తోలే సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి కొని ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ఏదైనా ప్రమాదం జరిగితే వాహనం తోలే వారితో పాటు వారి తల్లిదండ్రులు చట్ట ప్రకారం బాధ్యులవుతారన్నారు. 18 ఏళ్ల పై బడిన వారికి మాత్రమే వాహనాలు నడిపేందుకు ఇవ్వాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదమన్నారు. వాహనాలకు ఏటా బీమా తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ గమ్యానికి చేరుకోవాలని సూచించారు. హిందూపురం ప్రాంతంలో యువత కొందరు వీలింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని, పోలీసులు దీనిపై దృష్టి సారించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డితో పాటు న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి

గుడిబండ: మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ రాధమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బంగారమ్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో ఇంతవరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వైద్య సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి శాఖలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయితీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూతరాజు, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పత్తి, మొక్కజొన్న పంటల పరిశీలన

రొద్దం: మండలంలోని చెరుకూరు గ్రామంలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలను శుక్రవారం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య పరిశీలించారు. పత్తి పంట ప్రస్తుతం 60 రోజుల నుంచి 90 రోజుల మధ్య ఉందన్నారు. ఆయన మాట్లాడుతూ ఎకరా పత్తి పంటకు యూరియా 35 కిలోలు, పోటాష్ 15 కిలోలు మూడు దఫాలుగా వాలడాలన్నారు. పత్తి పంటలో మెగ్నీషియం ధాతులోపం అనిపించిందన్నారు. నివారణకు మెగ్నీషియం, సల్ఫేట్ 10 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటలో ఎరువుల యాజమాన్య పద్ధతి పాటించాలన్నారు. పంట దుక్కి దశలో ఎకరాకు యూరియా 50 కిలోలు, ఎస్ఎస్పీ 35 కిలోలు, ఎంఓపీ 25 కిలోలు వేసుకోవాలన్నారు. అనంతరం లిల్లీ పూల సాగును పరిలించిన అధికారులు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని నివేదిత, ఏఈఓ అంజాద్, వీఏఏ యోగేష్, రైతులు పాల్గొన్నారు.



చెరుకూరు వద్ద పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ట్రిపుల్ ఐటీకి లేపాక్షి విద్యార్థులు



సాయికిరణ్ ప్రదీప్ చైతన్య నాయక్

ఎస్ అరుణసాయి జీ హేమంత్‌కుమార్

లేపాక్షి: స్థానిక నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివి గిరి శుక్రవారం తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్‌గైడ్స్ కోటా కింద యు.సాయికిరణ్, పి.ప్రదీప్ ట్రిపుల్ ఐటీ సీటు సాధించారన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం తోపాటు పాఠశాల స్కౌట్స్ మాస్టర్ ఎన్.గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

గోరంట్ల: స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి చైతన్య నాయక్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు కరస్పాండెంట్ లక్ష్మీపతి తెలిపారు. మండలంలోని గడ్డంతండా గ్రామానికి చెందిన పుష్పావతి బాయి, వాసు నాయక్ కుమారుడు చైతన్య నాయక్ నారాయణ పాఠశాలలో చదువుతూ పదోతరగతిలో 600 మార్కులకు 587 మార్కులు సాధించాడు. దీంతో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. విద్యార్థిని శుక్రవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది.

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.అరుణ సాయి, జి.హేమంత్ కుమార్ ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు హెచ్ఎం జాబేజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యను అందించడంతోనే ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ సంఘం గౌరవ అధ్యక్షులు భూతన్న, సభ్యులు అభినందించారు.

వృద్ధులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్ రెడ్డి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వృద్ధాశ్రమానికి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వైసీ గోవర్ధన్ రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

రొద్దం: పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వలీబాషా హెచ్చరించారు. శుక్రవారం పెద్దమంతూరు సమీపంలోని పెన్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ యజమానులను ఎస్ఐ హెచ్చరించారు.

ఘనంగా మౌలాలి జెండా పండుగ



జెండా కర్రను మోసుకెళుతున్న ముస్లింలు

పెనుకొండ: పట్టణంలో శుక్రవారం మౌలాలి జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. మొహర్రంను పురస్కరించుకుని 5వ రోజు జెండా పండుగ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, యువకులు జెండాను దర్గా సర్కిల్ వరకు మోసుకువచ్చి అల్లా నామస్మరణ చేసారు. కోరికలు తీరిన వారు జెండా మహల్‌లో రోటీలను మొక్కుబడిగా అందించారు.

కార్మికులను ఆదుకోవాలి

సోమందేపల్లి: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం నాయకులు శీలా నారాయణ స్వామి, బెస్త కిష్టప్ప తదితరులు మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సోమందేపల్లికు వచ్చిన మంత్రిని వారు కలిశారు. బ్యాంకు రుణాలు మాఫీ చేసి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను రూ.10 లక్షలు పరిహారం అందజేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.1000 కోట్లు కేటాయించడంతోపాటు 11 రకాల చేనేత రిజర్వేషన్ పక్కాగా అమలు చేసి 45 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

పనిముట్లను వినియోగించుకోండి



వ్యవసాయ పనిముట్లపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శేఖర్ నాయక్

అగళి: మధూడి, ఇనగలూరు పంచాయతీల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏఓ శేఖర్ నాయక్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు వ్యవసాయ పనిముట్లపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణ ఆధికారి ద్రాక్షాయణి, మరతమ్మ రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. 4వ వార్డులో సుమారు రూ.2.50 కోట్లతో నిర్మించిన బీసీఎం బాలికల వసతి నిలయాన్ని మాజీ మంత్రి వెంకటరమణప్పతో కలిసి ఎమ్మెల్యే వెంకటేశ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదే విధంగా మైనారిటీ అభివృద్ధి నిధులతో 8, 12 వార్డుల్లో సుమారు రూ.కోటి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జేజేఎం పనులు తాలూకా వ్యాప్తంగా దాదాపు పూర్తి అయ్యాయన్నారు. అయితే పట్టణంలో ఇంకా మొదలు పెట్టలేదని వెంటనే జేజేఎం పనులు ప్రారంభించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీఎం డీఓ సోనియా వర్తికర్, స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, బత్తినేని నాని, రాజేశ్, రవి, రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, రిజ్వాన్, షా బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో మెరిసిన రైతు బిడ్డ



శ్యామ్ సుందర్

అమరాపురం: మండలంలోని హనుమంతనపల్లికి చెందిన రైతు చిక్కన్న, నాగలక్ష్మమ్మ దంపతుల కుమారుడు శ్యామ్ సుందర్ గురువారం విడుదలైన సీఏ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన శ్యామ్ సుందర్ ప్రాథమిక విద్యను ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, 6వ తరగతి నుంచి పదో తరగతి వరకూ గుడిబండ మండలం కుమ్మరనాగేపల్లిలో చదివాడు. ఏపీఆర్‌జేసీ కొడిగేనపల్లిలో ఇంటర్ చదువుకున్నాడు. శ్యామ్‌సుందర్ తల్లి నాగలక్ష్మమ్మ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేసింది. అలాగే తండ్రి చిక్కన్న గతంలో బసవనపల్లి సర్పంచ్‌గా పని చేశారు.

జర్నలిస్టుల యూనియన్ మండల కమిటీ ఎంపిక

అమరాపురం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండలంలోని జర్నలిస్టులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల జర్నలిస్టుల యూనియన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మండల గౌరవ అధ్యక్షుడు సిద్దేశ్వర తెలిపారు. మండల అధ్యక్షుడిగా హనుమంతరాయ, ఉపాధ్యక్షుడిగా ఆర్.చంద్రప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శివాచారి, సహాయ కార్యదర్శిగా టి.తిప్పేస్వామి, కోశాధికారిగా సిద్దేశ్వర, కార్యవర్గ సభ్యులుగా తిప్పేస్వామి, మల్లికార్జున, సాగర్, తిమ్మప్పను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు హనుమంతరాయ తెలిపారు.

అయోధ్యకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసు

హిందూపురం: హిందూపురం డిపో నుంచి అయోధ్యకు ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేశామని డీఎం శ్రీకాంత్ చెప్పారు. శుక్రవారం స్థానిక బస్టాండు వద్ద ఆయన అయోధ్య సర్వీసును ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూఈ నెల 27వతేదీ, ఆగస్టు 9న హిందూపురం నుంచి అయోధ్యకు ప్రత్యేక సర్వీసు నడుపుతామన్నారు. అయోధ్యకు రానుపోనూ ఒక్కరికి రూ.8,500 చార్జీ వసూలు చేస్తామన్నారు. అడ్వాన్స్ బుకింగ్ కోసం 9440834715 నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



అయోధ్య సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం శ్రీకాంత్

సంక్షిప్త సమాచారం

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

హిందూపురం: ఈనెల 24,25, 26 తేదీల్లో మదనపల్లి హార్సిహిల్స్ వద్ద మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు నిర్వహించే రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు అఖిల్ రాజు పాల్గొన్నారు

కేబుల్ చోరీ

మడకశిరరూరల్: ఆమిదాలగొంది చెరువు సమీపంలోని రెండు వాటర్ స్కీమ్ బోర్లకు అమర్చిన కేబుల్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని సర్పంచ్ గీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీలో గతంలో 15 బోర్లకు పైగా వాటర్ స్కీమ్, వ్యవసాయ బోర్లకకేబుల్ చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు ఆహ్వానం

మడకశిర: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఈనెల 21న జరగనున్న గురుపౌర్ణమి వేడుకలకు మంత్రి సవితను ఆహ్వానించారు. షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు శుక్రవారం పెనుకొండలో మంత్రి సవితను కలిశారు. గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొనాలని మంత్రికి ఆహ్వానపత్రిక అందజేశారు. షిర్డీ సాయిబాబా చిత్రపటం అందజేసి సన్మానించారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెల మృతి

పావగడ: తాలూకాలోని పళవల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో 5 గొర్రెలు మృతి చెందగా 20కి పైగా గొర్రెలు తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గొర్రెల యజమాని ముత్యాలప్ప గొర్రెలను దొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో పదికి పైగా వీధి కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో 5 గొర్రెలు మృతి చెందగా.. మరో 20కి పైగా గొర్రెలు గాయపడ్డాయి. పశువైద్యాధికారి హొరకేరప్ప సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతి చెందిన గొర్రెలకు పంచనామా చేశారు

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

రొద్దం: యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా కార్యదర్శి నరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెనుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం టోర్నీ ప్రారంభమవుతుందన్నారు. యూటీఎఫ్ సీనియర్ నేత రామాంజనేయులు జ్ఞాపకార్థం టోర్నీ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రతి మ్యాచ్ ఆదివారం మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు సుధాకర్, నారాయణస్వామి, డివిజన్ నాయకులు ఉపేంద్ర, గంగాధర్, ఆది జినేష్, ప్రభాకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. .

కదిలొచ్చిన తుంగభద్రమ్మ

పావగడ: తుంగభద్ర జలాలు ఎట్టకేలకు కదిలొచ్చాయి. తాలూకాలోని కెంచమ్మనహళ్లి సరిహద్దులో నిర్మించిన భారీ ట్యాంక్‌లోకి శుక్రవారం ఉదయం చేరుకున్నాయి. ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ కెంచమ్మన హళ్లి గేట్ వద్ద నిర్మించిన ఐపీఎస్-3 నీటి ట్యాంక్‌లోకి చేరుతున్న నీటిని పరిశీలించారు. తన తండ్రి, మాజీ మంత్రి వెంకటరమణప్ప హయాంలో ప్రారంభమైన ప్రాజెక్ట్ పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం తుంగభద్ర జలాలకు గంగ పూజ చేశారు. అంతకు ముందు స్థానిక మాజీ మంత్రి వెంకట రమణప్ప తదితర నాయకులు, ఇంజినీర్లు ఉదయం తరలివచ్చి పైపు ద్వారా వస్తున్న తుంగభద్ర నీటిని ఆసక్తిగా తిలకించారు. అయితే ఇవి ట్రయల్ నీళ్ల అని.. శుద్ధ తాగు నీరు రావాలంటే ఇంకా 3 నెలలు పట్టవచ్చని అధికారులు తెలిపారు.



పంప్ హౌస్ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్

రేపు ఎమ్మెల్యే బాలకృష్ణ రాక

హిందూపురం: ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదివారం హిందూపురం రానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. చిలమత్తూరు మండలం సోమగట్టలో ఉదయం 9 గంటలకు వాటర్ ప్లాంట్ ప్రారంభం, 10.30కు కొటిపి రోడ్డులోని టిడ్కో గృహల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ, టిడ్కో గృహలను పరిశీలన, 11. 30కు మున్సిపాలిటీ పరిధిలోని పరిగి బస్టాండ్ దగ్గర రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తారని పేర్కొన్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే ఇంటి వద్ద హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తారని వివరించాయి.

రోటర్‌కు చిక్కుకుని రైతు మృతి

పావగడ: ఐవార్లహళ్లికి చెందిన రైతు ఆనందప్ప రోటర్‌కు చిక్కుకుని మృతి చెందాడు. ఆనందప్ప ఇటీవలే కొత్తగా తెచ్చిన ట్రాక్టర్‌కు రోటర్ తగిలించుకుని భూమిలో గడ్డిని తొలగిస్తున్నాడు. ఈ సందర్భంగా రోటర్‌కు గడ్డి చిక్కుకోవడంతో గడ్డిని తొలగించడానికి ట్రాక్టర్‌ను ఆన్‌లో పెట్టి కిందకు దిగాడు. రోటర్‌కు ఉన్న గడ్డి తొలగించే ప్రయత్నంలో ట్రాక్టర్ వెనక్కి వచ్చింది. రోటర్ తగలడంతో ఆనందప్ప ముఖం, కాళ్లకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులను వెంటనే అతడ్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బాధితుడిని బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726